ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 18 నవంబరు 2024







ఆదాయం.. వద్దంట

- 74 దుకాణాల లీజుపై నిర్లక్ష్యం
- గత ఐదేళ్లూ పాడుపెట్టిన అధికారులు
- ఇప్పటికి రూ.2.50 కోట్లు కోల్పోయిన మున్సిపాల్టీ
- అధికారుల తీరుపై నరసరావుపేట వాసుల ఆగ్రహం
- ఆదాయ వనరులను చేజార్చుకోవడంలో ముందున్న వైనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదాయ వనరులను అందిపుచ్చుకోవడం.. లేదంటే వాటి కోసం అన్వేషించడం పరిపాటి. ఆదాయ వనరులను పెంచుకుని తద్వారా అభివృద్ధి పనులకు నిధులను సమకూర్చుకోవాల్సిన బాధ్యత మున్సిపాల్టీలది. కానీ నరసరావుపేట మున్సిపాల్టీ మాత్రం ఉన్న ఆదాయ వనరులను గాలికి వదిలేసి ఆదాయాన్ని చేజార్చుకోవడంలో ముందున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని మున్సిపల్ దుకాణాల సముదాయాల్లోని 74 దుకాణాలను లీజుకు ఇవ్వకుండా పాడుబెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలవుతున్నా ఆ దుకాణాల లీజుకు వేలం వేసి ఆదాయం సమకూర్చుకోవాలన్న ఆలోచన అధికారులు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దుకాణాలను లీజుకు ఇచ్చి వాటి ద్వారా ఏటా లక్షల్లో ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. సొంత షాపులైతే ఇలానే ఆదాయం లేకుండా వదిలేస్తారా.. అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు దుకాణాలను లీజుకు ఇవ్వకపోవడం వల్ల ఇప్పటి వరకు దాదాపు రూ.2.50 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. టీడీపీ కౌన్సిల్ హయాంలో రూ.7.40 కోట్లతో 66 దుకాణాలతో నాగసరపు సుబ్బరాయ గుప్తా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఇందులో 53 దుకాణాలను వినియోగించడంలేదు. ఇక్కడ దుకాణాలను హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు వినియోగిస్తున్నారు. ఈ షాపులకు కూడా పూర్తిస్థాయిలో అద్దెలు ఖరారు చేయలేదు. రైతుల కోసం కాంప్లెక్స్‌లో విశ్రాంతి గదులు ఏర్పాటు చేసినా వీటిని వినియోగించడంలేదు. ఈ గదుల్లో 6, 7 వార్డుల సచివాలయాలను ఏర్పాటు చేశారు. రైతుల కోసం నిర్మించిన గదుల్లో సచివాలయాలు ఏర్పాటు విమర్శలకు దారితీస్తోంది. ఆడిట్ కార్యాలయాన్ని కూడా ఇదే కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నారు.

షాపులు ఉన్నా రోడ్లపైనే విక్రయాలు

మటన్, చేపల మార్కెట్లను మూసివేసి ఉంచారు. సుబ్బరాయ గుప్తా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ప్రధాన రహదారి వైపు ఉన్న పది షాపులను కూడా లీజుకు ఇవ్వలేదు. దీంతో రోడ్లపైనే ప్రతి ఆదివారం మాంసం, చేపల విక్రయాలు జరుగుతున్నాయి. వీటిని నిరోధించి ఈ షాపులను తరలించే ప్రయత్నాలు జరగడం లేదు. ఈ షాపుల షట్టర్లకు కనీసం తాళాలు కూడా వేయలేదు. వీటిలో అసాంఘిక కార్యాకలాపాలు సాగుతున్నాయి. మందుబాబులు ఈ షాపులను అడ్డగా మార్చుకున్నారు. ఇక్కడ అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తున్నది. ఈ దుకాణాలను లీజుకు ఇవ్వకపోవడంతో ఇప్పటి వరకు మున్సిపాల్టీ రూ.1.50 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని అంచనా.

కాసు బ్రహ్మనందరెడ్డి కాంప్లెక్సులో..

స్టేషన్ రోడ్డులోని కాసు బ్రహ్మనందరెడ్డి కాంప్లెక్సులో 21 షాపులు పాడుబెట్టి ఉన్నాయి. దాదాపు 11 ఏళ్లుగా ఈ షాపునులను లీజుకు ఇవ్వలేదు. కాంప్లెక్స్ నిర్మాణానికి ముందు ఉన్న పాత కాంప్లెక్స్‌లో ఉన్న లీజుదారులకు తిరిగి షాపులు ఇచ్చే ఒప్పందంతో కొత్త కాంప్లెక్స్‌ను నిర్మించారు. అయితే సదరు బాధితులకు షాపులు కేటాయించకపోవడంతో వారు కోర్టును ఆశ్రయించారు. వారితో మున్సిపల్ అధికారులు చర్చలు జరిపి దుకాణాలను కేటాయించే ప్రయత్నాలు జరగడంలేదు. దీంతో మున్సిపాల్టీ భారీగా ఆదాయన్ని కోల్పోతోంది. దాదాపు రూ.కోటి వరకు ఆదాయాన్ని కోల్పోయినట్టు అంచనా.



కాసు బ్రహ్మనందరెడ్డి కాంప్లెక్స్‌లో పాడుబెట్టిన షాపులు



నాగసరపు సుబ్బరాయ గుప్తా కాంప్లెక్స్‌లో లీజుకు ఇవ్వని షాపులు

ఆర్జేడీ కార్యాలయం.. ప్రక్షాళన

- దీర్ఘకాలంగా తిష్టవేసిన ఉద్యోగుల బదిలీ
- ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్‌తో ఓ ఉద్యోగి పదేళ్లుగా విధులు
- అక్రమాలకు అండగా ఉన్న వారి స్థానచలనానికి కార్యాచరణ

గుంటూరు(విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాయం(ఆర్జేడీ)లో దీర్ఘకాలంగా తిష్టవేసి అక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కలిగించేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే ఏడీ స్థాయిలో ఉన్న ఉద్యోగిని కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. మరో ఇద్దరు ఉద్యోగుల్ని కూడా బదిలీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. మిగిలిన సిబ్బందిని దశలవారీగా బదిలీ చేయాలని నిర్ణయించారు. గుంటూరు డీఈవో కార్యాలయ ఆవరణలోని ఆర్జేడీ పరిధిలో గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల పరిధిలోని హెచ్‌ఎం స్థాయి ఉపాధ్యాయులు, ఎంఈవోల సర్వీస్ రూల్స్, ప్రైవేటు స్కూల్స్ గుర్తింపు, బీఈడీ, డీఈడీ కళాశాల నిర్వహణ, పనితీరు, తనిఖీలు, ప్రైవేటు స్కూల్స్‌లో అదనపు తరగతులకు అనుమతులు తదితర విషయాలను ఆర్జేడీ కార్యాలయం పర్యవేక్షిస్తోంది. ఇప్పటిదాక ఇక్కడ పనిచేసిన అధికారుల మెతక వైఖరిని అడ్డం పెట్టుకుని ఉద్యోగులు చెలరేగిపోయారన్న విమర్శలున్నాయి. అక్రమ పద్ధతుల్లో సంవత్సరాల తరబడి ఇక్కడే తిష్టవేసి సంపాదనలో మునిగిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల బాధ్యతలు చేపట్టిన కార్యాలయ అధికారి ఉద్యోగులపై అక్రమాలపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని విషయాల్లో ఆయన్ని సైతం తప్పుదోవ పట్టించేందుకు ఉద్యోగులు ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన కార్యాలయ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు సంఘాల నాయకులు చెబుతున్నారు.

- ఇక్కడ కీలకంగా పనిచేసే ఓ ఉద్యోగి ప్రకాశం జిల్లా నుంచి డిప్యూటేషన్‌పై వచ్చాడు. జిల్లాకు చెందిన ఓ సంఘం నేత నుంచి ఆఫీస్‌బేరర్ సర్టిఫికెట్ తీసుకువచ్చి దాదాపు పదేళ్ళుగా కార్యాలయంలో ఉద్యోగం వెలగబెడుతున్నాడు. వాస్తవానికి ప్రకాశం జిల్లాకు చెందిన ఈ ఉద్యోగికి గుంటూరు జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘ నాయకుడు ఇచ్చే ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్ ఉపయోగపడదు. అయితే అధికారుల్ని మాయచేసి ఇప్పటికీ ఇక్కడే కొనసాగుతున్నాడు. కార్యాలయంలోని సెక్షన్లలో ఎవరి ఫైల్ ఎక్కడ ఉంది.. దాని స్థితి ఏమిటి.. పరిష్కారానికి ఎంత చెల్లించాలనేది ఈ ఉద్యోగి నిర్ణయిస్తాడని సమాచారం.
- ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన మరో ఇద్దరు ఉద్యోగులు దాదాపు ఐదేళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తున్నారు. కార్యాలయానికి పనుల కోసం వచ్చే వారిని విభాగాలకు తీసుకెళ్ళి బేరాలు కుదర్చడంలో వీరుదిట్ట అనే ఆరోపణలు ఉన్నాయి.
- కార్యాలయంలో సూపర్‌మెన్‌గా పేరున్న ఓ ఉద్యోగి దాదాపు ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. ఈ సూపర్‌మెన్ అక్రమాలు సూపర్‌గానే ఉంటాయన్న ఆరోపణలున్నాయి. ప్రతి ఫైలుకు రేటు పెట్టి వసూలు చేస్తాడని సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఎక్కువ కాలం ఇతర జిల్లాల్లో ఇన్‌చార్జీలుగా పనిచేశారు. దీంతో ఈ సూపర్‌మెన్ ఫైల్స్‌ను ఏకంగా అధికారి పనిచేసే వద్దకే తీసుకెళ్లి పరిష్కరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- డీఈడీ కళాశాల గుర్తింపు, రెన్యువల్‌లో హైదరాబాద్‌లో జరిగిన అక్రమ వసూళ్ల విషయంలో గుంటూరు ఆర్జేడీ కార్యాయలంలో పనిచేసిన ఓ అధికారి కీలకంగా ఉన్న విషయం తెలిసిందే. వినుకొండ ప్రాంతానికి చెందిన ఓ డీఈడీ కళాశాల యాజమానితో కలిసి అక్రమ వసూలు చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన సంఘటన అప్పట్లో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ అధికారికి కర్త, కర్మ, క్రియగా పని చేసిన ఉద్యోగులు ఇప్పటికీ ఆర్జేడీ కార్యాలయంలో ఉన్నారు. ఇలా దాదాపు పది మందిపైగా ఉద్యోగులు నాలుగు నుంచి పదేళ్లకు పైగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఆయా ఉద్యోగులకు దశలవారీగా స్థాన చలనం కలిగించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

మళ్లీ కలుద్దాం



- కేరింతలతో సందడి చేసిన బాలబాలికలు
- ఘనంగా ముగిసిన వీవీఐటీ బాలోత్సవ్-2024

7
మహిళా న్యాయవాది ఆత్మహత్య
సోషల్ మీడియా కన్వీనర్ అరెస్టు
ఎంపీడీవోను దూషించిన వైసీపీ నేత అరెస్టు

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం

- వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ కరుణాసాగర్
- ఉత్సాహంగా వర్సిటీ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణా సాగర్

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడతాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్యపోటీలు ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో క్రీడలు అంతర్భాగాలన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని, నిత్యం సాధన చేయాలని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన మౌలిక అవసరాలను గుర్తించి క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామన్నారు. విద్యార్థులు క్రీడలను తమ రోజువారి జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం అపురూపమైనదని, ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, డాక్టర్ ఎన్టీఆర్ కాలేజి ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం

- సూర్యలంక సముద్ర తీరం కిటకిట
- పౌర్ణమి కంటే ఎక్కువగా తరలివచ్చిన జనం
- 180 మంది పోలీసుల బందోబస్తు.. మరబోట్లు, డ్రోన్లతో గస్తీ





మరబోటుపై సముద్రంలో గస్తీ నిర్వహిస్తూ భక్తులకు హెచ్చరికలు చేస్తున్న రూరల్ పోలీసులు



సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరం పర్యాటకులు, భక్తులతో పోటెత్తింది. పవిత్ర కార్తీక మాసంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు బాపట్ల నుంచే కాకుండా దూరప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చిన భక్తుల పుణ్యస్నానాలతో సముద్రతీరం పులకరించింది. కార్తీక పౌర్ణమి రోజు కంటే ఎక్కువ మంది భక్తులు తరలిరావడంతో తీరం కిక్కిరిసిపోయింది. దీంతో 180 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్లతో, సముద్రజలాల్లో మరబోట్లపై గస్తీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. స్నానాలు ఆచరిస్తున్న వారిని లోతుకు వెళ్ళనీయకుండా అప్రమత్తం చేస్తూ మైక్‌లో పోలీసు సిబ్బంది సూచనలు చేశారు. అలల తాకిడికి కొట్టుకుపోతున్న వారిని కాపాడారు. డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు గంగాధర్, హరికృష్ణ, మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసరావు, శ్రీనువాసులు, ఏఎస్ఐ అమరేశ్వరరావు తదితరులు భద్రతా ఏర్పాట్లలో పాల్గొన్నారు.

మండల స్థాయిలోనూ ఫిర్యాదుల స్వీకరణ

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వికేంద్రీకరణ
- నేటి నుంచి అమల్లోకి.. ఏర్పాట్లపై కలెక్టర్ ఆదేశాలు

నరసరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)ను ఈ సోమవారం నుంచి మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఇక నుంచి మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు ఇక నుంచి జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడికక్కడ అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చన్నారు. పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.

భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం

- వీరుల దేవాలయ సందర్శనలో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి



కన్నమదాసు ఖడ్గం చేతబూనిన ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

కారంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి పల్నాటి వీరారాధన ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వీరుల దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఆనాటి వీరులు ఉపయోగించిన అయుధాలను ఆసక్తిగా పరిశీలించారు. కన్నమదాసు భైరవఖడ్గాన్ని చేతపట్టారు. ఈ నెల 30 నుంచి ప్రారంభంకానున్న వీరుల ఉత్సవాల విశిష్టతను ఎమ్మెల్యే వీరాచారావంతులను అడిగి తెలుసుకున్నారు. పల్నాటి వీరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని వారికి చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశ, పీఠం నిర్వాహకుడు బొగ్గర విజయకుమార్, సర్పంచ్ సరస్వతిబాలునాయక్‌తో పాటు పంగులూరి అంజయ్య, పుల్లయ్య, చప్పిడి రాము, మునుగోడు సత్యం, గోళ్ల సురేష్ యాదవ్, బొల్నేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, మాజీ ఎంపీపీ నాగులునాయక్, బొమ్మిని శేషగిరి, రాముడు, దోర్నాల బ్రహ్మారెడ్డి, గాడిపత్రి పూర్ణయ్య, తోట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝున్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)



దేనికైనా రెడీ..!

**బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది.
ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు...
'బిన్ని అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్.
వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు
పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది.
తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు...
అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.**

అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్ని' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్ని' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్లుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లోకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రివ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, సైక్రో థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

- విష్వక్‌సేన్

'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథా



నాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాలని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి



నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'నక్క పొడు పొడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.





మళ్లీ కలుద్దాం

● కేరింతలతో సందడి చేసిన బాలబాలికలు ● ముగిసిన వీవీఐటీ బాలోత్సవ్-2024

పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంబూరు లోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) కళాశాలలో మూడు రోజులపాటు వైభవంగా జరిగిన ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్-2024 వేడుకలు ఆదివారంతో ముగిశాయి. కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకల్లో దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుండి వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ వేడుకకు 25,000 మంది హాజరయ్యారు. 20 అంశాలు 61 విభాగాలుగా జరిగిన ఈ పోటీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతోపాటుగా రెండు ప్రత్యేక బహుమతులను పోటీదారులకు అందించారు. బాలల వికాసం, సంస్కృతీ సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలకు తొలి రోజు నుండి విశేష స్పందన లభించింది. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడవరోజున విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాల నడుమ వీవీఐటీ ప్రాంగణంలో కోలాహలంగా మారింది. జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలు ఊగించాయి. 52 బృందాలు 3 వేదికల వద్ద జాతర వాతావరణాన్ని సృష్టించాయి. 36 శాస్త్రీయ నృత్య బృందాలు రెండు వేదికలపై ఉత్సాహంగా సాగాయి. విచిత్ర వేషధారణ పోటీలలో పాల్గొన్న చిన్నారులు విశేషంగా ఆకర్షించారు. వారు ప్రదర్శించిన ప్రదర్శనలు తెలుగు కళలను సాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉన్నాయి. మట్టితో బొమ్మలు, కాగితపు చేతి బొమ్మలు అంశాలలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొని ఆయా ఆకృతులను రూపొందించారు. సమాజానికి హితవు పలికేలా వారి ప్రదర్శనలు ఉన్నాయి.





గుంటూరు ఘనతలో వీవీఐటీ కూడా

నాగార్జున సిమెంట్స్ గ్రూప్ ఈడీ వాసిరెడ్డి విక్రాంత్

గుంటూరు ఘనతలో వీవీఐటీ కూడా చేరుతుందని ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగార్జున సిమెంట్స్ గ్రూప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసిరెడ్డి విక్రాంత్ అన్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఘనత తెలుపుతూ ఆయన పాడిన పద్యం ఆకట్టుకుంది.విక్రాంత్ మాట్లాడుతూ భాషసాహిత్యంపై పట్టు ఉంటే జీవితంలో విజయం సులువు అని తెలిపారు. వైవిధ్యం గల సంస్కృతి, భాషా మన సొంతం అని వాటిని పరి రక్షించుకోవాలని అన్నారు. కళలతో ఆనందంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తాను నమ్ముతానని చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీకి కూడా సృజనాత్మకత అవసరమని అన్నారు. సృజనాత్మక, నాయకత్వం లాంటివి కళలలో ఉంటాయని తెలిపారు.

ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వాలి

● అసెంబ్లీకి వస్తే కడిగేస్తాం ● నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే జూలకంటి



రెంటచింతల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వాలని, ఒకళ్లు ఇస్తే వచ్చేది కాదంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నిప్పులు చెరిగారు. రెంటచింతలలోని టీడీపీ సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రశ్నిస్తే సంకెళ్లు, ఎదురు తిరిగితే జైళ్లు, రాజ్యాంగ వ్యతిరేక,చట్ట వ్యతిరేక,ప్రజావ్యతిరేక నిర్ణయాలతో ప్రజాస్వామ్య వ్యవస్థకు పాతరేశారని విమర్శించారు. దళితులు,బీసీలు,మైనార్టీ,మహిళలకు నిద్ర కరువయ్యేలా చేశారని, రాక్షసులే నయం అనుకునేలా వ్యవహరించిన జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరైతే కడిగిపారేస్తామంటూ మండిపడ్డారు. 11 ఎమ్మెల్యే సీట్లకు ప్రతిపక్షహోదా రాదని తెలిసినప్పటికి ఏదో ఒరగబెడదామంటూ అధికార పక్షం అడ్డు తగులుతోందంటూ మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష హోదా లేకపోతే అసెంబ్లీకి వెళ్లనని చెప్పిన ఏకైక మాజీ సీం జగనేనని ఎద్దేవా చేశారు. వంది మాగధులతో నాడు అసెంబ్లీలో మహిళలను కించపరిచేలా ప్రోత్సహించిన జగన్ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు హాజరైతే ఆయన బండారాన్ని బయటపెడతారనే భయంతో తప్పించుకుంటున్నారని విమర్శించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రాణాలు తీసేందుకు యత్నించిన జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. పౌరహక్కులను కాలరాసిన వైసీపీకి ఓటర్లు గుణపాఠం చెప్పినా జగన్ ప్రవర్తనలో మార్పు రాలేదని దుయ్యబట్టారు. టీడీపీకి చెందిన ప్రతి ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టి జైళ్ల పాలు చేశారని, ఆ బాధితుల్లో తానూ కూడా ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయండి : యూటీఎఫ్

బాపట్లనవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను స్వాగతిస్తున్నామని, అదే సందర్భంలో బేసిక్ పాఠశాలలో కూడా 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగాలని కోరారు. రాష్ట్రంలో 12 వేల పైచిలుకు ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు ఉండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. అపార్, యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దని, బో ధన కార్యక్రమాలకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. బధిరుల చట్టం తీసుకురావడానికి జరుగుతున్న చర్యలను యూటీఎఫ్ స్వాగతిస్తుందని అన్నారు. ఒక నిర్దిష్టమైన సమయంలోనే బదిలీలు జరపాలని, ప్రమోషన్ వ్యవస్థను ఒక సరైన మార్గంలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులు పీఎఫ్ ఖాతాలు ప్రారంభించాలని, ఆ ఖాతాలలో జమ అయిన సొమ్ముకు జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకిచ్చే రకంగా వడ్డీని కూడా చెల్లించేవిధంగా తగు ఉత్తర్వులివ్వాలని కోరారు. కార్యక్ర మంలో జిల్లా నాయకులు ఎస్.పాపారావు, ఎం.వెంకటేశ్వర రెడ్డి, యు.చెంచయ్య, కె.రవిబాబు, బి.వినోద్‌కుమార్, పి.రామాంజనేయులు, కెవిఎస్ఎన్ కోటేశ్వరావు, రాష్ట్ర కౌన్సిలర్లు పి.సురేష్, జె.బాబురావు,వలిఖాన్, హాబీబ్, సీతారామరాజు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతం బాధ్యత ఉపాధ్యాయులదే

● ఎమ్మెల్సీ అశోక్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అశోక్‌బాబు

గుంటూరు(విద్య), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్సీ జేఏసీ మాజీ చైర్మన్ పీ అశోక్‌బాబు అన్నారు. స్థానిక కొత్తపేటలోని జలగం రామారావు మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం నోబుల్ టీచర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్,ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ హైమారావు మాట్లాడుతూ జీవోనం 84 రద్దు చేసి నగరంలో అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు గ్రేడ్- హెచ్‌ఎంలు, అన్ని పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్స్ అవసరమనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

సౌత్ ఇండియా పోటీలకు 13 మంది లిఫ్టర్లు

మంగళగిరి సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరుగనున్న సౌత్ ఇండియా ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు గుంటూరు జిల్లా నుంచి 13 మంది లిఫ్టర్లు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల



ఎంపికైన లిఫ్టర్లతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల సబ్‌జూనియర్స్‌లో శ్రావణి (43 కిలోలు), లక్ష్మీ వినయశ్రీ (84 కిలోలు), జూనియర్స్‌లో ఎం.షానూన్ (47 కిలోలు), ఎస్‌కే షబీనా (84 కిలోలు), చాతుర్య (76 కిలోలు), సీనియర్స్‌లో బి.చంద్రిక (76 కిలోలు), పురుషుల సబ్స్ జూనియర్స్‌లో హేమవర్దన్ (74 కిలోలు), నాగగణేష్ (93 కిలోలు), జూనియర్స్‌లో రమేష్‌శర్మ (76 కిలోలు), పృథ్వీ (105 కిలోలు), ఎస్ కౌశిక్ (93 కిలోలు), భరత్‌కుమార్ (59 కిలోలు) ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్య నారాయణ, సౌత్‌ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు అభినందించారు.

రాష్ట్రాభివృద్ధిలో 'గౌడ' కీలకం : మంత్రి అనగాని

తాడేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో గౌడ జాతి కీలకమని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని ఇప్పటంలో మండల గౌడ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి, సినీ నటుడు సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'గౌడ' అంటే వెనుకబడిన వర్గంగా కాకుండా రాష్ట్రంలో అభివృద్ధిని కాక్షించే పెద్ద కులమని అన్నారు. గతంలో సర్ధార్ పాపారాయుడు పౌరుషం, సర్ధార్ గౌతు లచ్చన్న ధైర్యంతో గౌడ కులం ముందుకొచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో గౌడల మరింత అభ్యున్నతితో ముందుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. సుమన్ మాట్లాడుతూ ఆత్మీయత, ఐక్యతకు ప్రతీక వనసమారాధన అని అన్నారు. భవిష్యత్ తరాలకు మేలు చేకూర్చే వృక్షజాతిని సంరక్షిం చాలనే నిగూఢ సందేశాన్ని వనసమారాధన ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్,



వేదికపై మంత్రి అనగాని, సినీనటుడు సుమన్, కొనకళ్ల నారాయణ తదితరులు

డాక్టర్ పలగాని శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఈవి నారాయణ, తాడేపల్లి మండల గౌడ సంఘం నాయకులు కంచర్ల కాశయ్య, లచ్చి తులసీదాస్, పలగాని నాగబాబు, ఐఎఫ్ఎస్ అధికారి శివప్రసాద్ పాల్గొన్నారు.

పెదకాకాని మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మూడో ఆదివారం సందర్భంగా పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేకువజాము నుంచే భక్తుల సందడి నెలకొంది. కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించిన భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో త్వరిత గతిన దర్శనము చేసుకున్న భక్తులు స్వామి వారికి అభిషేకాలు జరిపించారు. పొంగళ్లను నివేదించారు ఆలయ ప్రాంగణంలో మేళతాళాల నడుమ ప్రభలతో మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, మంచినీళ్ల బాటిల్స్ అందించారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవా రుసుములు, ప్రసాదం విక్రయము, అన్నప్రసాద విరాళాల ద్వారా రూ. 6,50,000 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

విజయవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారుకు బస్సు అడ్డం వచ్చిందని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో గొడవపడి దాడిచేసిన వ్యక్తులపై ఆదివారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్లకు చెందిన కోటేశ్వరరావు తెనాలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెనాలిలో ప్రయాణికులను ఎక్కించుకుని విజయవాడ బయలుదేరాడు. విజయవాడ బస్‌స్టేషన్‌లోకి వెళుతుండగా దుర్గమ్మ గుడివైపు నుంచి అతి వేగంగా వచ్చిన ఇన్నోవా కారు బస్సును ఢీకొట్టబోయింది. కారులో ఉన్న డ్రైవర్, మరో ఐదుగురు కారులో నుంచి దిగి బస్సును అడ్డుకుని, డ్రైవర్ కోటేశ్వరరావుతో గొడవపడ్డారు. అనంతరం డ్రైవర్‌పై దాడి చేశారు. స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బస్సు డ్రైవర్ కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. దాడి చేసిన వారి వివరాలు తెలియరాలేదు. కారును పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారిలో కొందరు మద్యం తాగి ఉన్నట్లు సమాచారం.

విద్యార్థినులకు అస్వస్థత

మాత్రలు మింగి స్పృహ తప్పిన వైనం.. గుంటూరుకు తరలింపు

సత్తెనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాత్రలు మింగి విద్యార్థినిలు అస్వస్థతకు గురైన సంఘటన పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల సంక్షేమ వసతి గృహంలో ఆదివారం రాత్రి జరిగింది. వసతి గృహంలో ఇంటర్ చదువుతున్న సనిత, అఖిల అనే ఇద్దరు విద్యార్థినులు అధిక మొత్తంలో డోలో - 650 మాత్రలు మింగి అశ్వస్థతకు గురయ్యారు. హాస్టల్ సంక్షేమ అధికారి రాణెమ్మ వారిని ఏరియా వైద్యశాలకు తరలించగా, వైద్యులు చికిత్సనందిస్తున్నారు. పోలీసులు సమాచారం అందించిన అనంతరం ఆ విద్యార్థినులను మెరుగైన వైద్యసేవల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆస్పత్రి వైద్య సిబ్బంది తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేయాలని ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అన్నారు. ఆదివారం ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని మంత్రి మండలి తీర్మానంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 23న కర్నూల్లో బీసీ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల శంఖారావాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓబీసీ సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర ఇన్‌చార్జ్ వై నూకాలమ్మలను సత్కరించారు. సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు, కలిశెట్టి లక్ష్మణరావు, భాను ప్రకాష్, ప్రవీణ్, గద్దం శంకర్ యాదవ్, అంకాల శ్రీనివాసరావు, నిర్మల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాది ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బార్ కౌన్సిల్ సభ్యురాలు, తెనాలి కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న కాకుమాను కిరణ్మయి (37) శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై భర్త గిరిధరరావు ఆదివారం ఉదయం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక కొత్తపేటలో నివాసం ఉండే న్యాయవాది కిరణ్మయి ఇటీవల జరిగిన న్యాయమూర్తుల నియామక పరీక్షల్లో ఆరు మార్కులు తేడాతో ఫెయిల్ అయింది. కొంతకాలం క్రితం టైఫాయిడ్ జ్వరంతో అనారోగ్యానికి గురైంది. దీంతో మానసికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నటు తెలిపారు. ఆమెకు ఇద్దరు సంతానం. పదిహేడేళ్ల కుమారుడు సాత్విన్, ఏడేళ్ల వయసు ఉన్న కుమార్తె నిహారిక ఉన్నారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం నాటికి 585.00 అడుగులు ఉంది. ఇది 297.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,900 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5510 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 18,110 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 18,110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఫ్లోర్‌బాల్ పోటీలో గుంటూరు ప్రథమం

చిలకలూరి పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్ 12, 17 బాల బాలికల ఫ్లోర్ బాల్ పోటీలలో అండర్ 17 బాలికల విభాగంలో గుంటూ రు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. బాలుర విభాగంలో కృష్ణా ప్రథమ స్థానం, బాపట్ల ద్వితీయ స్థానం, కడప జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. చిలకలూరిపేట మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం జరిగిన ఈ పోటీలలో 10 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. కాగా, అండర్ 12 బాలుర విభాగంలో బాపట్ల, కడప, ఎన్టీఆర్ జిల్లాల జట్లు, బాలికల విభాగంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. విజేతలకు చిలకలూరిపేట రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, కోశాధికారి కటకం శివరామ ప్రసాద్, చిలకలూరిపేట ప్రైవేట్ స్కూల్స్ సంఘం అధ్యక్షుడు వీరాస్వామి, డాక్టర్ సతీష్ బహుమతులను అందజేశారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కుడి కాలువలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

● ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి వెళ్లిన 'న్యూటన్స్' విద్యార్థి
● పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు వాసి



మౌనేష్ (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కుడికాలువలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతైన సంఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన మౌనేష్ (18) పట్టణ శివారులోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక విష్ణుప్రియ లాడ్జి వద్ద గల ఓ గదిలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన ముగ్గురు స్నేహితులతో కలిసి పట్టణంలోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడికాలువకు ఈత కొట్టేందుకు వెళ్లారు. మౌనేష్ మెట్ల వద్ద ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడటంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రభాకర రావు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. గజ ఈతగాళ్లతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు శ్రీధర్ మృతి



డాక్టర్ కిష్టంశెట్టి శ్రీధర్ (ఫైల్‌ఫొటో)

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక సౌజన్య హాస్పిటల్ వైద్యులు కిష్టంశెట్టి శ్రీధర్ మృతి చెందారు. దాచేపల్లి నుంచి కారులో ప్రయాణిస్తున్న శ్రీధర్ స్థానిక సూర్యాసెమ్ సమీపంలోకి రాగానే ముందుగా వెళ్తున్న లారీ రోడ్డు మార్జిన్ దిగే క్రమంలో కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీధర్ భౌతిక కాయాన్ని పట్టణంలోని వైద్యులు సందర్శించి నివాళులర్పించారు.

సోషల్ మీడియా కన్వీనర్ అరెస్టు

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ పులిచర్ల సురేష్‌రెడ్డిపై కేసు నమోదైనట్లు పిడుగురాళ్ల సీఐ ఎస్ వెంకటరావు తెలిపారు. ఓ మహిళ ఫిర్యాదుతో పిడుగురాళ్లకు చెందిన పులిచర్ల సురేష్‌రెడ్డిని శనివారం రాత్రి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేష్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీడీవోను దూషించిన వైసీపీ నేత అరెస్టు

నాదెండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమామిళ్ళకి చెందిన వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డిని ఆదివారం అరెస్టు చేశారు. మండల పరిషత్ స్థలంలో జరిపిన అక్రమ నిర్మాణాలపై గత శుక్రవారం ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి విచారణ జరుపుతుండగా ఆమె విధులను ఆయన అడ్డగించారని, కులం పేరుతో దుర్భాషలాడాడని పోలీసులకు ఎంపీడీవో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐ సుబ్బానాయుడు చిరుమామిళ్ళకి ఆదివారం ఉదయం వెళ్లి విచారణ జరిపారు. ఈ క్రమంలో కోటిరెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసి అరెస్టు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు

మాచర్లరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ భక్తులకు దైవ సందేశం అందించారు. అనంతరం తేరు ప్రదిక్షణ జరిపారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.86 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,545 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది.

మాలదారులకు సద్ది..

గురజాలటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాగ్దేవి కాలేజీ పక్కన నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవస్థానం షెడ్డులో మాలదారులకు ప్రతి రోజూ సద్ది నిర్వహిస్తున్నారు. 9 రోజుల పాటు సద్దికి గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ. 2.70 లక్షల సాయం అందించారు. శనివారంతో 9 రోజులు ముగిశాయి. ప్రతి రోజూ సద్దికి 700 మందికి పైగా మాలదారులు వస్తున్నారని ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

సాహిత్యమే భాషకు శ్వాస

పెదకూరపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాహిత్యమే భాషకు శ్వాస అని పిల్లలకు తెలుగు బాష పట్ల ఆసక్తి పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పై ఉందని, ప్రజాకవి దర్శి శేషారావు అన్నారు. 47వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కొర్రపాటి వాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

క్రోసూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం క్రోసూరులో బాల బాలికలకు పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వీరాంజమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంథాలయాన్ని సందర్శించాలని, గ్రంథాలయంలో సభ్యులుగా చేరాలన్నారు. స్మార్ట్ ఫోన్‌లను పక్కన బెట్టి పుస్తక పఠనాన్ని నేర్చుకోవాలని సూచించారు.

దుర్గి, (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రకృతి దృశ్యాలు, సేవ్ గర్ల్స్ అనే అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చలపతి, అయ్యప్ప విద్యానికేతన్, ప్రగతి, సీక్రెట్ హార్ట్ స్కూళ్లతో పాటు దుర్గి, ఓబులేశునిపల్లె జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, మోడల్‌స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, షేక్ అబ్బాస్, కొండలు, గ్రంథాలయ అధికారులు వేణుగోపి, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

గురజాలటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి హిమబార్గవి ఆధ్వర్యాన కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు జరిపారు. కార్యక్రమంలో కవిసుకూర్,హెచ్ఎం అమర్, అక్షర స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వ్రతం

మాచర్లటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆలయంలో అర్చకుడు కొండవీటి రాఘాచార్యులు, ఇష్టకామేశ్వరి వీరభద్రస్వామి ఆలయంలో బత్తినపాటి భరణి ఆధ్వర్యాన ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు పీటలపై కూర్చొని వ్రతం జరిపించారు. కార్యక్రమంలో వాసవీ అమ్మవారి ఆలయ అధ్యక్షుడు భవనాసి వెంకటేశ్వర్లు, కార్యదర్శి మాశెట్టి సైదారావు, కోశాధికారి సన్నిధి హనుమంతురావు, వీరభద్రస్వామి ఆలయ కమిటి సభ్యులు గంగిశెట్టి రాధాకృష్ణమూర్తి, ఓబులశెట్టి హనుమంతురావు, పందిరి బాలగురవయ్య, ఓరుగంటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

సత్తెనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై రాధాకృష్ణ పిలుపు నిచ్చారు. ఆదివారం పుతుంబాక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలను అందించాలన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు ఎస్ ఆంజనేయులు నాయక్, జీ రవి బాబు, జీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభం

సత్తెనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు పశు గ్రాస పెంపకం దారుల, ఉత్పత్తి దారుల సహకార సంఘం లిమిటెడ్ నూతన కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కట్టా రమేష్, నాయకులు మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కట్టా రమేష్‌ను కన్నా శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- దళారులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కృషి
- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
- అడిగొప్పులలో పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

దుర్గి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అడిగొప్పుల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు నాయుడు, డీప్యూటీసీఎం పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రంలో వ్యవసాయాన్ని రైతులకు గిట్టుబాటుగా మార్చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. పత్తి రైతులు అప్పులపాలు కాకూడదనే ఉద్ధేశ్యంతో ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాకు కనీస మద్దతు రూ. 7521 చొప్పున నిర్ణయించగా, కాటన్ కార్పొరేషన్ ఇండియా పత్తి కొనుగోలు చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను మోసం చేశారని, వైసీపీ నేతలు దోచుకోవడం, దాచుకోవడం తప్ప, వారి అభ్యున్నతికి ఏ విధమైన చర్యలు తీసుకుంది లేదన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో పత్తిని పరిశీలించారు. కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, జానకిరామయ్య, దారా రాఘవరావు, యాగంటి వెంకటేశ్వర్లు, తంగిరాళ్ల వెంకటేశ్వర్లు (పెద్ద బ్బాయి), చప్పిడి రాము, అమర నాగేశ్వరరావు, ఎడ్లవల్లి శ్రీనివాసరావు, కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.



గోలి గ్రామంలో భక్తులకు మంగళహారతి ఇస్తున్న ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, బీ.లక్ష్మారెడ్డి

ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గం

రెంటచింతల, (ఆంధ్రజ్యోతి): సన్మార్గానికి ఆధ్యాత్మిక చింతన బాటలువేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ ఎమ్మెల్యే బీ.లక్ష్మారెడ్డిలు బత్తుల లక్ష్మారెడ్డిలు తెలిపారు. ఆదివారం మండలంలోని గోలి గ్రామంలో తొమ్మిది ఎకరాల్లో, రూ.35 కోట్లతో నిర్మించనున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి ఆదివారం చేపట్టిన భూమిపూజ, పూర్ణాహుతి హోమం కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వేదపండితులు సాగి మట్టపల్లి, ధర్మయ్యశాస్త్రి, కార్తికేయల నేతృత్వంలో నవగ్రహ మండపారాధన, వాస్తు హోమం తదితర పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు బ్రహ్మానందరెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డిలు మంగళహారతిని భక్తులకు అందచేశారు. కార్యక్రమంలో నిర్వాహకులైన త్రిపుర కృష్ణారావు, నందిని, గోవర్ధనరావు, కోరె నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, మణికంఠ, పటాల సుబ్బారావు గురుస్వామి, కూటమి నేతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించే దిశగా చర్యలు

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- మోర్జంపాడు బుగ్గ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు, ఆంజనేయ స్వామి మండపం ప్రారంభం



బ్రాహ్మణపల్లిలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సీఎం చంద్రబాబునాయుడు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులను ఇబ్బందులు పెట్టకుండా పత్తిని కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో గండికోట వెంకటేశ్వర్లు, యక్కల పుల్లారావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, దున్నా చెన్నయ్యతో పాటు పలువురు నాయకులు, అధికారులు, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆదివారం కార్తీకమాసం సందర్భంగా బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆలయ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే యరపతినేనికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గర్భగుడిలోని శివలింగానికి వివిధరకాల అభిషేకాలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన మండపాన్ని ఆయన ప్రారంభించారు. అతిథుల విశ్రాంతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేవాలయంలో ఉన్న వివిధ దేవతా విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు,పూజారులు ఎమ్మెల్యే యరపతినేనిని దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



బుగ్గ మల్లేశ్వర స్వామి దేవాలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని



రామ్మూర్తి నాయుడు పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే

రామ్మూర్తి నాయుడుకి నివాళులు

పెదకూరపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు, సినీ హీరో నారా రోహిత్ తండ్రి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు పార్థీవ దేహానికి ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ నివాళులర్పించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని నారావారిపల్లెలో ఆదివారం రామ్మూర్తి నాయుడు అంత్యక్రియల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొన్నారు. రామ్మూర్తి నాయుడు అకాల మృతి చంద్రబాబునాయుడుకు, వారి కుటుంబానికి తీరనిలోటని ఆయన అన్నారు.

పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయం వద్ద రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, పిల్లి చెన్నారావు, గండికోట వెంకటేశ్వర్లు, కోట హరి, కొమ్మినేని రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహించిన రామ్మూర్తినాయుడు సంతాప కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు టీడీపీ నేతలు పంగులూరి అంజయ్య, సర్పంచ్ సరస్వతి బాలునాయక్, పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము, మునుగోడు సత్యం, బొల్నేడి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, చౌట శ్రీనివాసరావు, నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, కంభాల వెంకటేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య తదితరులు నివాళులర్పించారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆంజనేయుని విగ్రహం సెంటర్‌లో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టీడీపీ నేతలు నందిగం ఆశీర్వాదం, జనసేన పార్టీ అధ్యక్షుడు మట్టం వీరభద్రరావు, బత్తుల శ్రీనివాసరావు, తాళ్ళూరి సుబ్బారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండ్రు కాశయ్య , నలజాల కోటేశ్వరరావు, గుడిపాడు బాషా, మన్నెం శ్రీనివాసరావు, తదితరులు రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడులో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ రామగోపాలరావు, బాష్యం ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, లీలావతి, తదితరులు నివాళులర్పించారు.

అయ్యప్ప పడిపూజలో

ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠా కార్యక్రమాలు మూడు రోజుల పాటు వైభవంగా జరిగాయి. ఆదివారం అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారణ చేసిన అయ్యప్పలకు 40 రోజులపాటు సద్ది కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం దేవాలయంలో జరిగిన అఖండ దీపారాధన దివ్యపడి పూజ కార్యక్రమాన్ని గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ తాను అయ్యప్ప భక్తుడినని, ప్రతి ఏడాది అయ్యప్ప దర్శనానికి ప్రాముఖ్యత ఇస్తానన్నారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని యరపతినేని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ నారాయణ, సముద్రాల కృష్ణమూర్తి, పాలువాయి హనుమంతరావు, దేవాలయ శాశ్వత ధర్మకర్త గుండా శ్రీనివాసరావు, అధ్యక్షుడు అంచూరి శ్రీనివాసరెడ్డి, వున్నం సురేష్, పాండురంగ శ్రీను, ముప్పాళ్ల సాంబయ్య పాల్గొన్నారు.

కళ్యాణ మండపం ప్రారంభం

మాచర్లటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాగర్ రోడ్డులో నూతనంగా నిర్మించిన మీనాక్షి సుందరేశ్వరస్వామి కల్యాణ మండపాన్ని ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. అనంతరం మండపం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, హనుమంతురావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబాలకు భద్రత

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- మండలంలో పలు కార్యక్రమాలకు హాజరు



చేజర్లలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకోవటం ద్వారా వారి కుటుంబాలకు భరోసా, భద్రత ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ తెలిపారు. ఆదివారం చేజర్ల గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రూ.100చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. అన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా టీడీపీ మాత్రమే కార్యకర్తల సంక్షేమం కోసం కోట్ల రూపాయల ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల సత్యనారాయణ, అట్లూరి శాంతి, ఆవుల తిరుపతయ్య, రామచంద్రరరావు, ఉన్నం లక్ష్మణ్, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, షేక్ అలీ బాషా, పొదిలి వెంకట కోటయ్య, అట్లూరి పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు సాగి కోటేశ్వరరావు

నకరికల్లు మండల పరిషత్ తొలి అధ్యక్షుడు సాగి కోటేశ్వరరావు ప్రజా నాయకుడిగా పేరు గడించారని ఎమ్మెల్యే కన్నాఅన్నారు. ఆదివారం ఆయన చల్లగుండ్లలో సాగి కోటేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, యాళ్ళ శేష శ్రీనివాస సాయిబాబు, జడ్పీటీసీ హరీష్, జనసేన నేత వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కపోతేశ్వరునికి కన్నా కార్తీక మాస పూజలు

దక్షణ కాశీగా ప్రసిద్ధి గాంచిన గంగా బ్రమరాంభ పార్వతి సమేత కపోతేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో వై.వెంకయ్య, అర్చక స్వాములు కొండకావూరి వెంకట్రామయ్య శర్మ, బీవీఎస్ఎస్ కపోతేశ్వర శాస్త్రిలు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కన్నాను అట్లూరి శాంతి, సైదులరెడ్డిలు ఘనంగా సత్కరించారు.

నదిలో గల్లంతైన వ్యాపారి కోసం గాలింపు



కృష్ణానదిలో గల్లంతైన నీలా సత్యనారాయణ

రెంటచింతల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సత్రశాల వద్ద కృష్ణానదిలో గల్లంతైన వ్యాపారి నీలా సత్యనారాయణ(62) కోసం ఆదివారం రాత్రి వరకు గాలింపులు చేపడుతూనే ఉన్నారు. శనివారం భార్యభర్తలు సత్యనారాయణ, పద్మావతిలు నదిలో గల్లంతు కాగా, భార్య పద్మావతి మృతదేహం లభ్యంకాగా, సత్యనారా యణ ఆచూకీ లభించలేదు. దీంతో మత్స్యకారులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ వెంటకరమణ, శ్రీశైలం ప్రాజెక్టు సీఈ కాంతారావు దృష్టికి నదిలో వ్యక్తి కోసం గాలిస్తున్న సమాచారాన్ని తీసుకెళ్లారు. నాలుగన్నర గంటల పాటు విద్యుదుత్పత్తిని నిలిపి వేశారు. దీంతో ప్రవాహవేగం తగ్గి మహిళ మృతదేహం లభ్యమైంది. ఇప్పటికి 30 గంటలు గడిచినా సత్యనారాయణ ఆచూకి లభ్యం కాకపోవడంతో కుటుంబీకుల్లో ఆందోళన అధికమవుతుంది. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మళ్లీ జోక్యం చేసుకొని విద్యుదుత్పత్తిని కొన్ని గంటలపాటు నిలిపి వేసేలా చూసి సత్యనారాయణ ఆచూకీ లభ్యం కావడం కోసం చొరవచూపాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు. 2002 జూన్ 1న సత్రశాల కృష్ణానదిలో పుట్టి మునిగిపోగా 10మంది మృత్యువాత పడగా మరో 8మందిని సన్యాసిరావు అనే మత్స్యకారుడు కాపాడిన విషయం పాఠకులకు విదితమే.

నాగులేటిలో వ్యర్థాలు తొలగింపు



నాగులేటిలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

కారంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలో ఈనెల 30 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు జరగనున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని నాగులేటిలో ఆదివారం అభివృద్ధి పనులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో నాగులేటిలోని చెత్తాచెదారం, వ్యర్థాలు, నాచును తొలగిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 13 జిల్లాల నుంచి వీరాచారవంతులు ఈ ఉత్సవాలకు వచ్చి నాగులేటి నీటితో పొంగళ్లు వండి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ పనులను సరస్వతిబాయి బాలునాయక్, పంచాయతీ ఈవో కసిన్యానాయక్ పర్యవేక్షిస్తున్నారు.



ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నా తదితరులు

వైభవంగా ఆలయ ప్రతిష్ఠామహోత్సవం

సత్తెనపల్లి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకాలపాడు గ్రామంలో రేణుకా అంకమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అత్యంత ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని దేవతా మూర్తులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతోసత్కరిచారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొనికినేని సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ నన్నే సాహెబ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

19న క్రోసూరులో మెగా జాబ్ మేళా

క్రోసూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 19న క్రోసూరు ప్రభుత్వ పాల్ టెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన, 10వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ, పీజీ అర్హతలు గల 18 నుంచి 34 సంవత్సరాల లోపు యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు. జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్ లిమిటెడ్, ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్, పేటీఎం, ర్యాన్ స్టాండ్ వంటి కంపెనీలు హాజరవుతాయన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాసపోర్టు ఫోటోతో నేరుగా హాజరు కావచ్చన్నారు. పూర్తి వివరాలకు 9494986164, 8074393466 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగానే తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. క్రోసూరు నుంచి అమరావతి వెళ్ళే రహదారిలో విప్పర్ల గ్రామానికి ముందు ఉన్న ప్రభుత్వ పాల్ టెక్నిక్ కళాశాలల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం

బెల్లంకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కెనాల్స్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారిందని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివరెడ్డి పేర్కొన్నారు. బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ఎర్రబాలెం మేజరుకు గండి పడటంతో 70 ఎకరాల వరి పంట పూర్తిగా నీటిలో మునిగి పోయిన విషయం పాఠకులకు విదితమే. ఆదివారం వెన్నా సాంబశివారెడ్డి ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటికి అందే దాక వచ్చిన వరి పంట కెనాల్స్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పూర్తిగా దెబ్బతిన్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రబాలెం మేజరుకు కాలువ గట్లు సక్రమంగా లేవని అధికారులకు రైతులు విన్నవించినా పట్టించు కోలేదని, దీని వల్లే రైతులకు అపార నష్టం జరిగిందన్నారు. ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్‌తో చర్చించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని రైతులకు హామి ఇచ్చారు. ఆయన వెంట మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, తిప్పిరెడ్డి పిచ్చిరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధనలు

- పాల్గొన్న ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముచికుంద మహర్షి ఆశ్రమంలో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సామాజికవర్గం ఎక్కడున్నా వ్యాపారరంగంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో ఆర్యవైశ్యులకు ఎంతో అనుభవం వుందని, ఏ ప్రాంతంలో ఎక్కడున్నా తోటి వారికి సహాయం అందించే మంచి మనస్తత్వం ఆర్యవైశ్యులకు వుంటుందన్నారు. గురజాల నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల వ్యాపార అభివృద్ధికి తాను అండగా వుంటానన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యరపతినేని తనయుడు నిఖిల్, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, కట్టమూరి శంకరరావు, కొత్త రఘురామయ్య, గుండా రామారావు, వనజా సాంబశివరావు, మాశెట్టి బుజ్జి, మద్దాళి సుబ్బయ్య, కొత్త వెంకట చలపతిరావు, చేగు రమేష్, యక్కల మోహన్‌రావు, లఘువరపు రామనాథంతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువ వద్ద ఆదివారం కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నియోజక వర్గ స్థాయి కార్తీక వన సమారాధన జరిగింది. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వన సమారాధనలో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వాలను కూడా అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సేవా సమితి సభ్యులు కన్నా లక్ష్మీనారాయణను దుశ్శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, జనసేన నియోజక వర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, పోట్ల ఆంజనేయులు, వక్కంటి అజయ్ కుమార్, యర్రా వెంకటేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్ కుమార్, ఆళ్ళ సాంబయ్య, ఆళ్ళ అమరేశ్వరరావు, రావిపాటి మధుబాబు, కట్టా రమేష్, కట్టా సుధీర్, నియోజక వర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కమ్మజన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని తెలగ హాస్టల్‌లో ఆదివారం కాపు కార్తీక వన సమారాధనను ఘనంగా నిర్వహించారు. గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపులంతా ఐక్యంగా ఉండాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణ, మండలానికి చెందిన పలువురు కాపులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో అవినీతిపై విచారణ చేపట్టాలి

- ఎంపీపీ, ఎంపీడీవోకి ఎంపీటీసీ సభ్యుల వినతి

ముప్పాళ్ళ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని పలువురు ఎంపీటీసీలు ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మారూరి పద్మావతి, ఎంపీడీవో పీజే విలియమ్స్‌లకు వినతి పత్రం అందించారు. సర్వసభ్య సమావేశంలో మండల స్థాయి అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వంలో మంత్రి అంబటి రాంబాబును అడ్డం పెట్టుకొని ప్రొటోకాల్‌ను పాటించ కుండా ఇష్టానుసారంగా వ్యవహరించారని, ప్రొటోకాల్ నిబంధనలపై కూడా విచారణ చేపట్టాలన్నారు. గత ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లను అడ్డంపెట్టుకొని పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల్లో గ్రామాల్లో ఎక్కువ అవకతవకలు జరిగాయని బొల్లవరం ఎంపీటీసీ కల్లం వీరభాస్కర్‌రెడ్డి, ముప్పాళ్ళ ఎంపీటీసీ చిరుగూరి చిన రాయన్న, దమ్మాలపాడు - 1 ఎంపీటీసీ కే సరోజినిలు, జడ్పీటీసీ శిరిగిరి చంద్రకళలు, జనసేన ఎంపీటీసీ శిరిగిరి రామారావులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో బీజే విలియమ్, తహసీల్దార్ ఎం భవానీశంకర్, ఈవోపీఆర్‌డీ రూపవతి పాల్గొన్నారు.



ఎంపీపీ, ఎంపీడీవోలకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మృతుడి కుటుంబానికి రూ.2లక్షలు అందజేత

ఈపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళలో రోడ్డుప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త సూర్యవిజయభాస్కర్ కుటుంబానికి రూ.2లక్షలు ఆదివారం టీడీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విడపలపాటి హనుమయ్య, సూరేనర్సయ్య, సురేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వినుకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు కళాశాలతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకొని ఉత్సాహంగా గడిపారు.

హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలి

వినుకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావం బహిరంగ సభ సన్నాహక సమావేశం స్థానిక వెల్లటూరు రోడ్డులోని ఎంపీపీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా నరసరావుపేట నుంచి కొత్త రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంత సహబౌద్ధిక్ వేదాంత గోవిందరామానుజాచార్యులు పాల్గొని మాట్లాడుతూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించేందుకు జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావ బహిరంగ సభను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో భాగవతుల రవికుమార్, గోనుగుంట్ల గంటారావు, యిమ్మడిశెట్టి మల్లికార్జునరావు, ఆర్ఎస్ఎస్ వినుకొండ ఖండకార్యవాహ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలంపై జాప్యం

శావల్యాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో చేపల చెరువు గడువు ముగిసినా అధికారులు చర్యలు తీసుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కారుమంచి, వయ్యకల్లు, చిన్నకంచెర్ల, ముండ్రువారిపాలెం గ్రామాల్లోని చేపల చెరువులకు గతంలో నిర్వహించిన వేలం గడువు ముగిసి నెలలు గడుస్తున్నా అధికారులు నిర్లక్ష్యంతో తిరిగి వేలంపాటను నిర్వహించకపోవడంతో ఆయా పంచాయతీలకు చేకూరాల్సిన ఆదాయానికి పూర్తిస్థాయిలో గండి పడుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 1434, 1435 ఫసలీలకు మద్దతు ధరను నిర్ణయించాలని మండల విస్తరణాధికారి రెండు నెలల క్రితమే డివిజనల్ పంచాయతీ అధికారికి నివేదిక పంపగా వారు మత్యశాఖ అధికారుల అనుమతి కోసం సిపార్సు చేశారు. డీఎల్‌పీవో సిపార్సుచేసి పది రోజులు గడుస్తున్నా మత్యశాఖఅధికారి ఇంతవరకు అనుమతిని ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వేలం నిర్వహణలో జాప్యం చోటుచేసుకొంది.

ఘనంగా రెడ్డి సంఘీయుల కార్తీక వన సమారాధన

వినుకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెల్లటూరు రోడ్డులోని శ్రీయోగివేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి రెడ్డి సామాజిక వర్గీయులు కుటుంబాలతో పెద్ద ఎత్తున పాల్గొని పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన జక్కిరెడ్డి సుబ్బారెడ్డి, మారెళ్ళ కొండరెడ్డిలు రెడ్డి సామాజికవర్గంలోని నిరుపేద విద్యార్థులకు, మెరిట్ స్కాలర్‌షిప్‌లను రూ.13లక్షల చెక్కులను అందజేశారు. అనంతరం సేవా సమితి అధ్యక్షుడు ఆరే శివారెడ్డి మాట్లాడుతూ త్వరలో భవన నిర్మాణం పూర్తిచేసి స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఏర్పాటుచేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ పెద్దిరెడ్డి సుదాకరరెడ్డి, ట్రెజరర్ రామిరెడ్డి, గంధం బాలిరెడ్డి, తుమ్మా రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిషన్‌ను అంగీకరించం

● మాల మహానాడు అధ్యక్షుడు కీర్తిపాటి

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్‌రంజన్ మిశ్ర కమిషన్‌ను అంగీకరించేది లేదని వినుకొండ నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వానికి ఎస్సీల స్థితిగతులపై అధ్యయనం చేసే ప్రత్యేక కమిషన్ నియమించే అధికారం లేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్ ఉండగా వేరొక కమిషన్ వేయడం తాము కోరుకున్న విధంగా తమ రాజకీయ ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసం మాత్రమే రాజీవ్ రంజన్‌మిశ్ర కమిషన్ వేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోండ్రు విజయ్, కార్యదర్శి రాయని చిన్న, కొమ్మతోటి సుధాకర్, పమిడిపల్లి ఇశ్రాయేలు, కృపయ్య, పి.వెంకటరావు, శ్రీదేవి, బిల్లా ఇస్రాయేలు, ఎ.శ్రీను, ఆర్. రాజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

బొందిలిపాలెం (శావల్యాపురం) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అసెంబ్లీ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు పొనుగోటి వెంకట్రావు, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి సి.రాజశేఖర్, మాజీ గ్రామపార్టీ అధ్యక్షుడు సోమేపల్లి వెంకట్రావు, తెలుగు యువత వెంకటేష్ సీనియర్ నాయకులు సి.వెంకటేశ్వర్లు, పి.బసవయ్య, డి.వెంకటేశ్వర్లు, జె.బాలాజీసింగ్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా వేబ్రిడ్జి

● వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షల వ్యయంతో నిర్మాణం
● పల్లపు ప్రదేశంలో నిర్మించడంతో వర్షం కురిస్తే చుట్టూ నీరు
● మెరక చేసి, లోపాలను సరిచేయాలంటున్న రైతులు


కనమర్లపూడిలో నిర్మించిన వేబ్రిడ్జి

శావల్యాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలను విక్రయించే సమయంలో తూకాలను సరి చూసుకొనేందుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో శావల్యాపురం మండలం కనమర్లపూడిలో లక్షలు ఖర్చుచేసి నిర్మించిన వేబ్రిడ్జి నిరుపయోగంగా మారింది. మండలంలోని వేల్పూరు, పోట్లూరు, కొత్తలూరు, మతుకుమల్లి గ్రామాల్లో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకొనేందుకు మల్టీపర్పస్ గోడౌన్‌లను నిర్మించి వాటికి అనుసంధానంగా వేబ్రిడ్జి నిర్మాణం చేస్తున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. నిర్మాణమయితే పూర్తి చేశారుగానీ, దాన్ని వాడుకలోకి తేకపోవడంతో వేబ్రిడ్జి అందుబాటు ఉన్నా రైతులు ఉపయోగించుకోలేని దుస్థితి నెలకొంది. పల్లపు ప్రదేశంలో వేబ్రిడ్జిని నిర్మించడంతో వర్షం కురిసిన ప్రతిసారీ వేబ్రిడ్జి చుట్టూ నీరు నిలబడుతోంది. జాతీయ రహదారి పైనుంచి బరువైన వాహనాలు పల్లపు ప్రదేశంలోని వేబ్రిడ్జి దగ్గరకు వెళ్ళాలంటే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు కొంత మెరకలేపి వేబ్రిడ్జిని నిర్మించారు. అయిప్పటికీ పూర్తిగా మెరక చేయకపోవడంతో వేబ్రిడ్జి వినియోగం ప్రశ్నార్థకంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి వేబ్రిడ్జి నిర్మాణంలో లోపాలను సవరించి రైతులకు పంటలు చేతికొచ్చే సమయానికైనా వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో కవి సమ్మేళనం


కవి సమ్మేళనంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

నరసరావుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. గ్రంథాయల అధికారి యడ్లపాటి రాధ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, ప్రవచనకర్త పీవీఎస్ఆర్ ప్రసాద్, గద్య పద్య కవి ఈపూరి వెంకటరెడ్డి, త్రిభాషా పండితుడు డాక్టర్ కాసులనాటి నాగరాజశర్మ, పీఎన్‌సీ, కేఆర్ డిగ్రీ కళాశాల సాంస్కృతోపాన్యాసకులు జొన్నభట్ల లక్ష్మీనారాయణ, పాల్గొని సందేశాలు, కవితలు అందించారు. అనంతరం అతిథులకు సన్మానం జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం తెలుగు ఉపాధ్యాయులతో కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు కవితలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పెద్ద పోతురాజు, పాశం నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బొల్లాపల్లిలో కుర్చీలాట ఆడుతున్న విద్యార్థినులు

కేజీబీవీ పాఠశాలలో...

రొంపిచర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వారోత్సవాలు జరుగుతున్నాయి. సంతగుడిపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు చదరంగం, క్యారమ్స్, వ్యాస రచన పోటీలు, రొంపిచర్లలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారులు వెంకటరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: స్థానిక మండల కేంద్ర మైన బొల్లాపల్లిలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు తెలుగు భాష గొప్పతనం మీద సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, మైకేల్ పాల్గొని తెలుగు భాష విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అలాగే గ్రంథాలయ అధికారి రామావత్ సేవా నాయక్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాట్లాడే భాష తెలుగు అని, భారతదేశంలో ఆరు సంప్రదాయ భాషల్లో తెలుగు భాష ఒకటన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, పద్యాలు, పాటల పోటీలు నిర్వహించారు.

● ఈపూరు: జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ముందుగా గురజాడ అప్పారావు, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు ఎస్.నాగలక్ష్మి, గంటా శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని నాదెండ్ల గ్రంథాలయంలో నాలుగో రోజైన ఆదివారం వారోత్సవాలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావటంతో చదువంటే మాకిష్టం కార్యక్రమం కింద విద్యార్థులను గ్రంథాలయంలో చదివించారు. ఆదివారం ఆటపాటలతో పాటు పుస్తకాలు చదివేందుకు కూడా విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు సూచించారు.

పోటాపోటీగా జోన్ లెవల్ ఆటల పోటీల ఫైనల్స్


క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, అధికారులు

నూజెండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డాక్టర్ గురుకుల పాఠశాలలో జోన్-3, జోనల్ లెవల్ ఆటల పోటీల ఫైనల్స్ ఆదివారం పోటాపోటీగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు క్రీడలను వీక్షించి గెలుపొందిన జట్లకు ట్రోఫీలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక మానసిక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభా పాఠవాలను ప్రదర్శించటం ద్వారా ఉన్నత శిఖరాన్ని అధిరోహిస్తారన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, అథ్లెటిక్స్‌లో 30పాఠశాలలకు చెందిన 1200మంది విద్యార్థులు గత నాలుగు రోజులుగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రొడ్డా వీరాంజనేయరెడ్డి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణారావు, పాఠశాల ప్రిన్సిపాల్ బీవీ రమణమ్మ, స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ కో-ఆర్డినేటర్ టీ జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


పెద తురకపాలెంలో హిందీ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 17: రాష్ట ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం పెద తురకపాలెంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హాస్టల్ విద్యార్థినులకు చలి కోట్లు, వాటర్ బాటిళ్లను దాతల సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విద్యార్థులకు అందజేశారు. ఇదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు పి.జ్యోతిర్మయి ఇటీవల టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్న నేపథ్యంలో ఉపాధ్యాయురాలు జ్యోతిర్మయిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

బొల్లాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో కార్తీక మాసం, కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ళ కమిటీ, చిలకలూరిపేటల కమిటీల ఆధ్వర్యంలో వెల్లటూరులో త్రైత సిద్ధాంత భగవద్గీత, పలు అనుబంధ గ్రంథాల ప్రచారం చేశారు. కార్తీక మాసం డిసెంబరు 1వ తేదీ వరకు ఉంటుందని, అందరూ దీపారాధనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కే అరుణ, కే కార్తీక్, కే నారాయణమ్మ, కే అంగమ్మ, సీహెచ్ అనురాధ, ఎన్ వెంకట లక్ష్మి, బీ శ్రీను, ఎం వీరయ్య, పీ రాఘవ, వై రామాంజనేయులు, వీ సుందరం, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు నాయక్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళ స్థలాల కోసం అర్జీల స్వీకరణ

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణంలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలోని మూడు సెంట్లు ఇళ్ళ స్థలాలను వెంటనే పంపిణీచేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ తెలిపారు. ఆజాద్ కాలనీలో ఇళ్ళ స్థలాలు లేని నిరుపేదల నుంచి అర్జీలు స్వీకరించే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ళులేని నిరుపేదలకు ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిరుపేదల నుంచి ఇళ్ళ పట్టాలకు అర్జీలు స్వీకరించి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. మున్సిపాలిటీ, సచివాలయ అధికారుల ద్వారా అర్జీలు స్వీకరించి రెవెన్యూ అధికారులు పరిశీలించి నియోజకవర్గంలోని ప్రజలకు నివాసయోగ్యమైన ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలు ఇవ్వాలన్నారు. ఇళ్ళ స్థలాలు ఇచ్చిన వెంటనే ఐదు లక్షల రూపాయలతో ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, మల్లిఖార్జునరావు, మస్తాన్, జల్లి వెంకటేశ్వర్లు, శ్రీను, హనుమాదేవి, పేరమ్మ, సలోమి, కొండమ్మ, జ్యోతి, జె.పద్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా కేంద్రం

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో ఒమేగా హాస్పటల్ వారి సౌజన్యంతో ఈ నెల 19వ తేదీ గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టు సరోజిని, నార్నె జయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చీరాల రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ క్యాన్సర్ పరీక్షా శిబిరంలో స్త్రీలకు గర్భ సంచి ముఖ ద్వార క్యాన్సర్ పరీక్ష, ఈసీజీ గుండె పరీక్షలు, బీపీ షుగర్ టెస్టులు ఉచితంగా చేస్తారన్నారు. చిలకలూరిపేట పరిసర ప్రాంత మహిళలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.


మహారాణ ప్రతాప్ సింగ్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే, సంఘ సభ్యులు

కోటప్పకొండలో మహారాణా ప్రతాప్‌సింగ్ విగ్రహావిష్కరణ

నరసరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహారాణా ప్రతాప్‌సింగ్ ఒక వ్యక్తి కాదు సమూహశక్తి అని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ, చిన్నప్పుడు చదువుకున్న రోజుల్లో పుస్తకాలలో ఆయన గురించి వింటుంటే ఒక శక్తి ఉప్పొంగేదని అటువంటి వ్యక్తి విగ్రహాన్ని కోటప్పకొండలో ఆవిష్కరించడం ఎంతో శుభ పరిమాణమని అన్నారు. అనంతరం అఖిల భారతీయ క్షత్రియ మహాసభ మహిళ వైస్ ప్రెసిడెంట్ పండరీబాయి మాట్లాడుతూ, దేశమంతటా మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహాలను 500 వరకు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కోటప్పకొండలో ఆవిష్కరించిన విగ్రహం 17వది కాగా, త్వరలో శ్రీశైలంలో కూడా రాణా ప్రతాప్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించి, మ్యూజియం కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత క్షత్రియ మహాసభ నేషనల్ ప్రెసిడెంట్ రాజా మన్విందర్ సింగ్, మహారాణ ప్రతాప్ సింగ్ స్మారక్ అభియాన్ నేషనల్ ప్రెసిడెంట్ చంద్రవీర్ సింగ్ నామాన తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో కోటిశివ పంచాక్షరి - అష్టోత్తర కలశపూజ


నరసరావుపేటలో 108 కలశాలతో నిర్వహిస్తున్న పూజ

నరసరావుపేట రూరల్, నవంబరు 17: పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో లోక కల్యాణం కోసం సనాతన హిందూధర్మ పరిరక్షణ కోసం డాక్టర్ వీఎల్ నారాయణస్వామి ఆధ్వర్యంలో కోటిశివ పంచాక్షరి - అష్టోత్తర (108) కలశపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారతదేశంలోని 108 నదులు, సప్త సాగరాల నుంచి సేకరించిన నీటితో కాశీ విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు, గురు ప్రార్థన, గణపతి పూజ, లలితా కుంకమార్చన, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం, సుదర్శన హోమం, వాస్తు హోమం నిర్వహించారు.

విద్యార్థులకు యూనిక్ ఐడీ కష్టాలు

రొంపిచర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపుపొందిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం యూనిక్ ఐడీని ఇవ్వాలని ఆదేశాలు జారీచేసింది. ఇందుకోసం విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాఠశాలల రికార్డుల్లో ఒకేలా ఉండాలి. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాల, ఐదు యూపీ, 43 ఎలిమెంటరీ పాఠశాలలతో పాటు మూడు గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4866 మంది 1వ తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో 3690 మందికి వివరాలు సక్రమంగానే ఉన్నట్టు గుర్తించారు. 534 మందికి జనన ధ్రువీకరణ పత్రాలు లేవు. 484 మందికి ఆధార్‌లో తప్పులు ఉన్నాయి. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులో వివరాలు సక్రమంగా ఉండి పాఠశాల రికార్డులో తప్పుగా ఉంటే సంబంధిత రికార్డులో వివరాలను మరలా పొందుపరచటానికి ఎంఈవో, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అధికారం ఇచ్చారు. వచ్చే సంవత్సరం జనవరి నెలకు వివరాలు పొందుపరచటం పూర్తికావాల్సి ఉంది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జనన ధ్రువీకరణ పత్రం త్వరితగతిన అందేలా చూస్తే ఆధార్, పాఠశాల రికార్డుల్లో సులువుగా మార్చుకొనే అవకాశం ఉంది. విద్యార్థులకు ఇచ్చే యూనిక్ ఐడీతోనే రాబోయే కాలంలో విద్యాభ్యాసం, ప్రభుత్వ పథకాలు అందనున్నాయి.

రోడ్డును పునరుద్ధరించరూ ...

సమస్య ఇది.. స్పందించరూ


కుంగిపోయిన చెంచుకాలనీకి వెళ్ళే సిమెంట్ రోడ్డు

బొల్లాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో చెంచుకాలనీకి వెళ్ళే ప్రధాన రహదారి సిమెంట్ రోడ్డ కొద్ది నెలల క్రితం కుంగింది. నిత్యం ఎప్పుడూ రద్దీగా ఉండే సిమెంట్ రోడ్డు కుంగిపోవటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ రహదారిని పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. గతంలో సచివాలయ సిబ్బందికి విన్నవించినా స్పందన లేదని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన సిమెంట్ రోడ్డును పునరుద్ధరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

జగన్ మీడియావి తప్పుడు రాతలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు




చిలకలూరిపేట అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శవ రాజకీయాలకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే పెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో ఖండించారు. నారా రామ్మూర్తి నాయుడు మరణంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం విషాదంలో ఉంటే తమ్ముడిని అన్నే తొక్కేశాడని, కుటుంబంలో విభేదాలు అంటూ జగన్ మీడియా తప్పుడు రాతలు రాస్తుందని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత మనుషులను రాజకీయంగా అవసరానికి వాడుకొని అవసరం తీరాక సొంత వారినైనా తొక్కేయటం ఎలాగో జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసినట్టు మరెవ్వరికీ తెలియదంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు పక్కన ఉంటే నువ్వు ఎదగలేవు, కాంగ్రెస్‌లో చేరితే నిన్ను ఎమ్మెల్యేని చేసి మంత్రిని చేస్తామని ప్రలోభపెట్టి రామ్మూర్తి నాయుడును 2004 ఎన్నికలకు ముందు పార్టీలో చేర్చుకొని తీరా ఎన్నికల సమయానికి టిక్కెట్ కూడా ఇవ్వకుండా ఎగగొట్టిన చరిత్ర రాజశేఖరరెడ్డిది. మరో పక్క తల్లిని, చెల్లిని బయటకు గెంటేసి వారిపై కోర్టులో కేసులువేసిన చరిత్ర నీది. ఇటువంటి చరిత్ర ఉన్న జగన్‌కు గాని, అక్కడి మీడియాకు గాని కుటుంబాలు, వారి అనుబంధాల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తన సొంత చెల్లి, తల్లిపైనే తప్పుడు రాతలు రాయించిన వ్యక్తులకు ఇతరులపై బురద చల్లటం పెద్ద కష్టమైన పనేమి కాదని, తప్పుడు రాతలు మాని ముందు నీ తల్లి, చెల్లి పత్రికాముఖంగా అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.


కమ్మ సేవాసంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సేవాసంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు


ఘనంగా కమ్మజన కార్తీక వన సమారాధన

నరసరావుపేట రూరల్, నవంబరు 17: పట్టణంలోని రావిపాడు రోడ్డులోని కమ్మ బాలుర హాస్టల్‌లో ఆదివారం కమ్మ జన కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట పట్టణంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. నరసరావుపేట పట్టణంలోని ప్రధాన సెంటర్ల నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, అమరావతి రాజధాని ఫైల్స్ సినిమా నిర్మాత రవిశంకర్, టీడీపీ యువనేత కోడెల శివరాం పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగోతు శౌరయ్య, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము, రావెల సత్యనారాయణ, డాక్టర్ నలబోతు వెంకట్రావు, వేములపల్లి వెంకట నరసయ్య, లాం కోటేశ్వరరావు, కోమటినేని నాసరయ్య, డాక్టర్ కడియాల లలితసాగర్ తదితరులు పాల్గొన్నారు.


రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన, టీడీపీ సీనియర్ నాయకులు

నారా రామ్మూర్తినాయుడుకు ఘన నివాళి

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు మరణం రాష్ట్రానికి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మక్కెన మల్లికార్జునరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అనారోగ్యంతో మృతిచెందిన నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందడంతోపాటు 1994లో చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ప్రజలకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకటరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, ఆళ్ళ మస్నెయ్య, శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణరావు, పువ్వాడ కృష్ణ, గుర్నాధం, గంధం సుబ్బారావు, వి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


జలబిందెలతో వస్తున్న బాలికలు, ప్రత్యేక అలంకరణలో నాగమయ్యస్వామి

వైభవంగా నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళ

శావల్యాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురంలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవాలయం వద్ద 44వ తిరునాళ్ళ వేడుకలను చైర్మన్ మద్దిగుంట్ల హరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్, రామిరెడ్డి శ్రీనివాసరావు, శ్రీదేవి ఆధ్వర్యంలో తెల్లవారుజామున 40మంది బాలికలు జలబిందెలతో దేవాలయానికి వచ్చి రాళ్ళగుట్టకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు, బోనాలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. నాగరాజ జెండాకు వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు కొర్నెమల్లి సాంబశివరావు, కేతేపల్లి వెంకటేష్, అమరజ్యోతికలు పాల్గొన్నారు.

గీతా మందిరంలో వైభవంగా శ్రీకృష్ణుడికి అభిషేకం

చిలకలూరిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌత్రా సెంటర్‌లోని గీతామందిరంలో ఆదివారం రోహిణి నక్షత్రం సందర్భంగా శ్రీకృష్ణుడి అభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి ప్రత్తిపాటి వెంకట కుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.